సాక్షి వికారాబాద్

బుధవారం : 28 : మే : 2025



నాలాపై కన్నేసి..

కొంగరకలాన్‌లోని దాతర్‌చెరువు కాల్వపై కన్నేసిన అక్రమార్కులు దాన్ని మట్టితో నింపి కబ్జా చేశారు.

8లో▸



గడువులోగా అందించాలి

విద్యార్థులకు గడువులోగా యూనిఫాం అందజేయాలని డీఆర్‌డీఏ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యారావు ఆదేశించారు.

8లో▸



భూసార పరీక్షలతో మేలు

రైతులందరూ విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

9లో▸

న్యూస్‌రీల్

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి

అనంతగిరి: ప్రజా సమస్యలపై ఈ నెల 30న తలపెట్టిన కలెక్టర్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్.వెంకట్రాములు పిలుపునిచ్చారు. మంగళవారం వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు అందజేయాలని కోరారు. అలాగే ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మహిపాల్, జిల్లా కమిటీ సభ్యులు రామకృష్ణ, వెంకటయ్య, చంద్రయ్య, సతీశ్, శ్రీనివాస్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణకు కృషి

జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి రవీందర్‌యాదవ్



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న రవీందర్‌యాదవ్

దౌల్తాబాద్: టీబీ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి రవీందర్‌యాదవ్ అన్నారు. టీబీ ముక్త భారత్ అభియాన్ ఆధ్వర్యంలో మంగళవారం మాటూరు గ్రామంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షయ వ్యాధి ఉన్న వారికి జ్వరం, దగ్గు, నీరసం బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు తప్పకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ శిబిరంలో 360మందికి పరీక్షలు చేయగా 63 మందిని అనుమానితులుగా గుర్తించారు. వీరికి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి అమూల్య ప్రియదర్శిని, సంతోష్, మాధవి, సూపర్‌వైజర్ రఫీ, రాహత్‌శ్రీధర్, ఏఎన్‌ఎంలు ఆశ కార్యకర్తల పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలి

ప్రజా, విద్యార్థి సంఘాల డిమాండ్

తాండూరు టౌన్: ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్ చేసిందని దీనిపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వామపక్ష ప్రజా, కార్మిక, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేత పేరుతో అమాయక గిరిజనులను, సానుభూతి పరులను హత్య చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. మావోయిస్టు జాతీయ కార్యదర్శి కేశవరావును పట్టుకుని నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారని ఆరోపించారు. ఈ ఆపరేషన్‌లో మృతి చెందిన మావోయిస్టులవి బూటకపు ఎన్‌కౌంటర్‌లేనని, వీరి మృతిపై సిట్టింగ్ జడ్జిచే విచారణ చేపట్టాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రప్ప, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అంజి, మహేష్, ఆనంద్, పకీరప్ప, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలెక్కని పర్యాటకం



213 ఎకరాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి అనుమతులు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రణాళిక
- అనంతగిరుల బాధ్యతలు మెఘా సంస్థకు..
- రూ.వెయ్యి కోట్లతో ప్రభుత్వంతో ఎంఓయూ
- రెండేళ్లు కావస్తున్నా ముందుకు పడని అడుగు

స్వదేశీ దర్శన్ కింద..

కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ పేరుతో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. రెండో విడతలో మన జిల్లాలోని అనంతగిరిని, యాదాద్రి జిల్లాలోని భువనగిరి కొండను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ముందుకెళ్లాలని భావించింది. అనంతగిరి కొండలు, సమీప అటవీ ప్రాంతం.. పరిసర ప్రాంతాల్లోని సర్పన్‌పల్లి, కోట్‌పల్లి ప్రాజెక్టులకు పర్యాటకంగా తీర్చిదిద్దాడానికి ప్రణాళికలు రూపొందించారు.

అనంత పద్మనాభస్వామి ఆలయం

వికారాబాద్: జిల్లాలో పర్యాటక అభివృద్ధి ఒక అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కి అన్నట్లు తయారైంది.. వికారాబాద్ సమీపంలో అనంతగిరి కొండలు, కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టులు, బుగ్గ రామేశ్వర ఆలయం వంటి చూడదగ్గ ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. అనంతగిరి కొండలను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. రెండేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించింది. మెఘా సంస్థ రూ.1,000 కోట్లతో అనంతగిరిని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. దీంతో ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని అందరరూ భావించారు. రెండేళ్ల క్రితం డీపీఆర్ తయారి బాధ్యతలను ఎల్‌అండ్‌టీ సంస్థకు అప్పగించారు. ఇందుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ తయారు చేశారని గతంలో అధికారులు చెప్పారు.. ఇందులో భాగంగా ఆరు నెలల క్రితం టెండర్లు పిలిచేందుకు సిద్ధమయ్యారు. 213 ఎకరాల్లో టూరిజం అభివృద్ధికి రూ.110 కోట్లు ఖర్చవుతుందని అంచనా కూడా వేశారు. ప్రస్తుతం మెఘా సంస్థతో రూ.1,000 కోట్లతో ఒప్పందం కుదరడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. మొదటి విడతగా రూ.33 కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వం భావించింది. కానీ ఇప్పటి వరకు పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

అడ్వెంచర్ టూరిజం స్పాట్‌గా..

సాధారణంగా పర్యాటక కేంద్రాలను రెండు రకాలుగా అభివృద్ధి చేస్తారు. ఒకటి సాధారణ పర్యాటకం.. ఇందులో అడవుల అందాలను వీక్షించడం, ఆలయాల సందర్శన వంటివి ఉంటాయి..రెండోది అడ్వెంచర్ టూరిజం(సాహస పర్యాటకం). ఇందులో యువత ఇష్టపడే సాహస కృత్యాలను డెవలప్ చేస్తారు. ట్రెక్కింగ్, రోప్ వేలు వంటివి ఉంటాయి. అనంతగిరుల్లో ఈ రెండింటినీ అభివృద్ధి చేయాలని ప్లాన్ చేశారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. ఎకో పార్క్, కన్వెన్షన్ హాళ్లు, ట్రెక్కింగ్, రోప్ వేస్, హోటల్స్, ఆలయాల అభివృద్ధి, వ్యూ పాయింట్స్, గార్డెన్లు, డైనింగ్ హాల్స్, పక్షులు, జంతువులను వీక్షించిందేకు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా 213 ఎకరాలను అన్ని హంగులతో తీర్చిదిద్దాలని నిర్ణయించారు. రోజుకు 5వేల మంది పర్యాటకులు వచ్చేలా.. వెయ్యి మంది ఇక్కడ బస చేసేందుకు అవసరమయ్యే ఏర్పాట్లు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 500 మంది నుంచి 1000 మంది వరకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉంది.



వికారాబాద్ సమీపంలోని అనంతగిరి కొండలు

అనేక అనుకూలతలు

అనంతగిరిని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. వికారాబాద్ జిల్లా కేంద్రానికి అత్యంత సమీపంలో ఉండటంతో పర్యాటకంగా తీర్దిద్దాడానికి సిద్ధమయ్యారు. ఈ ప్రాంతం హైదరాబాద్‌కు 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే గంటలో నగర వాసులు ఇక్కడికి చేరుకోవచ్చు. బెంగళూరు, ముంబై హైవేల నుంచి కూడా గంటలోపు ఇక్కడికి రావచ్చు. రీజనల్ రింగ్ రోడ్డు అందుబాటులోకి వస్తే కేవలం 15 నిమిషాల్లో అనంతగిరులకు రావొచ్చు. దట్టమైన అడవులు, ఎత్తయిన కొండలు, రోడ్డు మార్గంలో అందమైన మలుపులు, గుట్టపై చారిత్రాత్మకమైన అనంతపద్మనాభ స్వామి ఆలయం, ట్రెక్కింగ్ స్పాట్‌లు, అనేక రకాల పక్షిజాతులు, జంతుజాతులు ఈ అడవిలో ఉన్నాయి. తెలంగాణ టూరిజం శాఖ నిర్మించిన కాటేజీలు, బుగ్గ రామేశ్వర ఆలయం, కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టులు, అందులో బోటింగ్ ఇలా అనేక రకాలు అనంతగిరిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అనుకూల అంశాలు ఉన్నాయి.



ఆరుద్రకు ఆతృత!

బొంరాస్‌పేట: ఈ సారి రుతుపవనాలే కాదు ఆరుద్ర పురుగు కూడా ముందుగానే వచ్చేసింది. జూన్ 22 నుంచి ఆరుద్ర కార్తె ప్రారంభమవుతుంది. ఆ సమయంలో పొలాల్లో ఆరుద్ర పురుగు కనిపిస్తుంటుంది. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో ముందుగానే ఆరుద్ర కనువిందు చేస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్ (చిత్రంలో) ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పాల్గొన్న అధికారులు

జాబ్‌మేళాను సక్సెస్ చేయాలి

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

అనంతగిరి: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 29న తాండూరులో నిర్వహించే జాబ్‌మేళాను విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాబ్‌మేళాపై తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఉపాధి కల్పన, మార్కెటింగ్ మిషన్(ఈజీఎంఎం) ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 52 పరిశ్రమల్లో 11 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పం మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాండూరు పట్టణంలోని వినాయక కన్వెన్షన్ హాల్‌లో జాబ్ మేళా ఉంటుందని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఈజీఎంఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణన్, జేడీఎం సతీష్, తాండూరు సీడీపీఓ శ్రీలత, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, ఎంపీడీవోలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

అటవీ భూమిని ఆక్రమిస్తే చర్యలు



యాలాల: సంగాయిపల్లి వాసులతో సమావేశమైన అటవీ శాఖ అధికారులు

- డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్
- భూమి కబ్జా చేసిన వ్యక్తిపై కేసు

బొంరాస్‌పేట: మండలంలోని తిర్మలాపూర్‌లో అటవీ భూమిని ఆక్రమించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నామని డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్ తెలిపారు. ఈ నెల 24న సాక్షి దినపత్రికలో అటవీ భూమి ఆక్రమణ అనే శీర్షికన ప్రచురితమై కథనంపై ఆయన స్పందించారు. మంగళవారం ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అటవీ భూమిని ఆక్రమించిన ఘటనపై ఈ నెల 23న ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. ఎన్కేపల్లికి చెందిన పూజారి నర్సింలు 1.30 ఎకరాల భూమిని కబ్జా చేసినట్లు గుర్తించి కేసు నమోదు చేశామని తెలిపారు. రూ.20 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. నరికిన చెట్ల స్థలంలో కొత్తగా మొక్కలు నాటించి, వాటిని సంరక్షించే బాధ్యత నర్సింలుకు అప్పగిస్తున్నామని చెప్పారు. అక్రమార్కులు అడవిలోకి ప్రవేశించకుండా ట్రెంచింగ్ పనులు చేయించామని పేర్కొన్నారు.



తిర్మలాపూర్ అటవీప్రాంతంలోకి వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా తవ్విన కాల్వ

అడవుల సంరక్షణ మన బాధ్యత

యాలాల: అడవులు, వన్యప్రాణుల సంరక్షణ మన బాధ్యతఅని జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని సంగాయిపల్లి తండాలో అడవుల సంరక్షణపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటవీ భూముల్లో చెట్లు నరకడం నేరమన్నారు. అటవీ భూమిని ఉపగ్రహ ఛాయా చిత్రాలతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యాలాల తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎస్‌ఐ గిరి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రాజేందర్, సెక్షన్ ఆఫీసర్లు కనకరాజు, శంకర్, బీట్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

3,022 క్వింటాళ్ల జొన్నల కొనుగోలు



మోమిన్‌పేటలో జొన్నల కొనుగోలు ప్రక్రియను పరిశీలిస్తున్న డీసీఓ నాగార్జున తదితరులు

- రైతుల ఖాతాల్లో రూ.కోటి జమ చేశాం
- డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ ఆఫీసర్ నాగార్జున

మోమిన్‌పేట: మోమిన్‌పేట పీఏసీఎస్ ఆధ్వర్యంలోని 3,022 క్వింటాళ్ల జొన్నల కొనుగోలు చేశామని, ఇందుకు సంబంధించి రైతుల ఖాతాల్లో కోటి రూపాయలు జమ చేశామని డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ ఆఫీసర్ నాగార్జున తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వమే మద్దతు ధరకు జొన్నలు కొనుగోలు చేసిందన్నారు. ఇప్పటి వరకు 170 మంది రైతుల నుంచి 3,022 క్వింటాళ్ల కొనుగోలు చేశామన్నారు. సేకరించిన జొన్నలను తాండురులోని డీసీఎంఎస్ గోదాంకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు దళారులకు పంట దిగుబడి విక్రయించి మోసపోరాదని సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. రైతులకు సహకార సంఘాల ద్వారా ఎరువులు, విత్తనాలు అందిస్తున్నట్లు వివరించారు. పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, బంగారు నగలపై రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. 750 మంది రైతులు సంఘంగా ఏర్పడి ఒక్కొక్కరు రూ.2 వేల చొప్పున బ్యాంకులో డిపాజిట్ చేస్తే రూ.15లక్షలు అవుతుందని.. బ్యాంక్ తన వాటాగా మరో రూ.15 లక్షలు వారి పేరిట డిపాజిట్ చేయనున్నట్లు చెప్పారు. ఈ డబ్బుతో సంఘం సభ్యులు వ్యాపారంలో పెట్టుబడులు పెట్టుకోవచ్చని సూచించారు. పీఏసీఎస్‌లో ఉన్న వాటా మూలధనంపై డెవిడెంట్లు ఇవ్వాలని చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి డీసీఓను కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ నారాయణరెడ్డి, సీఈఓ శేఖర్, జిల్లా సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

అన్నదాతకు వరుణ గండం

- దంచికొడుతున్న వానలు
- కోతకు వచ్చినా పొలాల్లోనే వరి పంట
- కొనుగోలు కేంద్రాల్లో తడుస్తున్న ధాన్యం బస్తాలు
- అన్ని విధాలా నష్టపోతున్న రైతన్న
- ఆదుకోవాలని విన్నపం



హస్నాబాద్‌లో కోతకు వచ్చిన వరి పంటను వదిలేసిన రైతు

దుద్యాల్: ముందస్తు నైరుతి రుతుపవనాలతో మండలంలో వానలు దంచికొడుతున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పంటకు నష్టం వాటిల్లుతోంది. ప్రస్తుతం వరి పంట కోతకు వచ్చింది. ఇప్పటికే చాలా మంది రైతులు కోతలు పూర్తి చేసి దిగుబడిని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. అక్కడ తూకం వేయడంలో జాప్యం జరుగుతుండటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాల కారణంగా మరికొంత మంది కోతలు ఆపేశారు. వానలు తగ్గితే తప్ప కోతలు సాధ్యం కాదని అంటున్నారు. దీంతో పొలాల్లో అలాగే వదిలేశారు. లక్షల పెట్టుబడి పెట్టి పంట చేతికొచ్చే సమయంలో వరుణుడు ప్రతాపం చూపుతున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేరుకుపోతున్న ధాన్యం నిల్వలు

దుద్యాల్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. లారీలు సకాలంలో రాకపోవడంతో వడ్ల బస్తాలను మిల్లులకు తరలించడం లేదు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచారు. పంట దిగుబడిని కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ధాన్యం బస్తాలను త్వరగా మిల్లులకు తరలించాలని వారు కోరుతున్నారు.

ఇళ్ల మధ్య వర్షపు నీరు

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని హస్నాబాద్ ఎస్సీ వాడ జలమయంగా మారింది. ఇళ్ల మధ్య భారీగా నీరు చేరింది. నడిచేందుకు కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. కాలనీ సమీపంలో రోడ్డు పనులు జరుగుతున్నాయి. కల్వర్టు నిర్మాణ పనులు నత్తనడకగా సాగుతుండటంతో వర్షపు నీరు ముందుకు వెళ్లడం లేదని స్థానికులు తెలిపారు.

మట్టి వేయడంతోనే..



కాలనీ సమీపంలో రోడ్డు పను లు జరుగుతున్నాయి. కాలనీ నుంచి వర్షపు నీరు దిగువకు పో కుండా కాలువకు అడ్డంగా మ ట్టి పోశారు. దీంతో ఇళ్ల మధ్య నీరు నిలిచి బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. మరి కొన్ని రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందున వెంటనే చర్యలు చేపట్టాలి. లేకుంటే ఇళ్లల్లోకి వరద నీరు చేరే అవకాశం ఉంది.

– దశరథ్, ఎస్సీ కాలనీ వాసి, హస్నాబాద్



దుద్యాల్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలు



ఎస్సీ కాలనీలో ఇళ్ల మధ్య చేరిన వర్షపు నీరు

జాగా కోసం జగడం

- రెండు కుటుంబాల ఘర్షణ
- గంగ్వార్‌లో ఘటన
- ఇరువర్గాల ఫిర్యాదులు
- అధికారుల రంగ ప్రవేశంతో సమస్య కొలిక్క



వివాదాస్పద ఇంటి స్థలాన్ని పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రుతి, ఎస్‌ఐ శంకర్

బషీరాబాద్: ఇంటి స్థలం కోసం రెండు కుటుంబాలు కొన్ని రోజులుగా గొడవ పడుతున్నాయి. ఆ జాగా మాదంటే.. మాదంటూ పత్రాలతో పోలీసులు, అధికారులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువర్గాలు రాజకీయ నాయకులను ఆశ్రయించడంతో సమస్య మరింత జఠిలమైంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బషీరాబాద్ మండలం గంగ్వార్ గ్రామానికి చెందిన కరణం చంద్రకళ, కరణం ప్రేమలతల ఇంటి స్థలం పక్కన ఊరడి నర్సమ్మకు ఇంటి జాగా ఉంది. ఇటీవల చంద్రకళ, ప్రేమలత ఇంటి నిర్మాణ పనులు మొదలుపెట్టారు. తమ స్థలంలో ఇల్లు కడుతున్నారంటూ నర్సమ్మ కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాలు బషీరాబాద్ పోలీసులకు, ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదులు చేసుకున్నారు. ఇది సివిల్ కేసు కావడంతో పోలీసులు.. పంచాయతీ కార్యాలయానికి వెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.

ఎట్టకేలకు పరిష్కారం

ఇంటి జాగా వివాదం పెద్దది కావడంతో ఎంపీడీఓ శెట్టి రవికుమార్ పంచాయతీ కార్యదర్శి శ్రుతిని గ్రామానికి వెళ్లి పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మంగళవారం ఆమె, ఎస్‌ఐ శంకర్ గ్రామానికి చేరుకొని వివాదాస్పద ఇంటి స్థలాన్ని పరిశీలించారు. ఇరువర్గాలను పిలిపించి గొడవ పడకుండా సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. దీంతో రెండు కుటుంబాలు.. గ్రామస్తులతో కలసి చర్చించారు. ఊరడి నర్సమ్మ తన ఇంటి ముందు ఉన్న జాగాలో 11 ఫీట్ల వదిలి ఇల్లు కట్టుకోవాలని సూచించారు. ఇందుకు చంద్రకళ, ప్రేమలత అంగీకరించారు. దీంతో సమస్య పరిష్కారమైంది.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


పోలీస్‌స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్

తాండూరు రూరల్: వీర్‌శెట్టిపల్లి గ్రామంలో కొందరు అక్రమార్కులు పట్టపగలు వాగులో నుంచి ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మంగళవారం వీర్‌శెట్టిపల్లి గ్రామానికి చెందిన పరుశురాం వాగులో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నాడు. ఈ సమాచారం పోలీసులకు చేరడంతో గోనూర్ గేటు వద్ద అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ట్రాక్టర్‌కు ఎలాంటి పర్మిషన్ లేకపోవడంతో పాటు నంబర్ కూడా లేదు. దీంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి యజమాని పరశురాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేసులకు భయపడేది లేదు

తాండూరు టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులపై పెట్టే అక్రమ కేసులకు భయపడేది లేదని విద్యార్థి విభాగం నాయకులు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమయ్యారని సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్వీ నాయకులు దహనం చేశారు. ఈ ఘటనలో పట్టణ పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో హాజరైన అనంతరం బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు, పట్టణాధ్యక్షుడు సందీప్ రెడ్డి, నాయకులు వినోద్, నర్సింహులు మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, బీఆర్ఎస్ నాయకులపై కక్షపూరిత కేసులు బనాయించడం సిగ్గు చేటన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎన్ని కేసులనైనా ఎదుర్కొంటామని, సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

నివాళి


నివాళులర్పిస్తున్న చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

బషీరాబాద్: ఏకాంబరి రామలింగేశ్వర ఆలయ ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసిన ఆచారి నర్సిములు(75) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. నీళ్లపల్లికి చెందిన ఆయన ఆలయ పరిసరాల్లో ఇల్లు నిర్మించుకుని చాలా కాలంగా ఇక్కడే ఉంటున్నారు. శాసన మండలి చైర్మన్ పట్నం మహేందర్‌రెడ్డి నీళ్లపల్లికి చేరుకొని నర్సిములు మృతదేహానికి నివాళులర్పించారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు

మూసాపేట: గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లాకు చెందిన విక్రాంత్ రెడ్డి కూకట్‌పల్లిలోని హాస్టల్‌లో ఉంటూ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. భూపాలపల్లి జిల్లాకు చెందిన దీక్షిత్, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన అభినయ్, మంచిర్యాలకు చెందిన అన్షు అతడి స్నేహితులు. గంజాయికి అలవాటు పడిన వీరు గంజాయిని కొనుగోలు చేసి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల వారికి పరిచయమైన అనురాగ్, వినయ్ కూడా వారితో జత కలిశారు. దీంతో వారు 10 కేజీల గంజాయిని కొనుగోలు చేసి తీసుకువచ్చారు. కూకట్‌పల్లిలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వెనుక టీస్టాల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులకు సమాచారం అందింది. దీంతో దాడి చేసిన పోలీసులు నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా నిందితుల్లో ఒకరైన అభినయ్ 2024లో బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడని, మిగిలిన ముగ్గురూ ఖాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో జైలుకు వెళ్లి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న అనురాగ్, వినయ్ కోసం గాలిస్తున్నామన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాలాపై కన్నేసి మట్టితో పూడ్చేసి!

- రాత్రికి రాత్రే దాతర్‌చెరువు కాల్వ ఆక్రమణ
- రెండున్నర ఎకరాల భూమికి ఎసరు
- పూర్తిస్థాయి విచారణకు ఇరిగేషన్ డీఈఈ ఆదేశం


దాతర్‌చెరువు కాల్వను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ హరిత తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: దాతర్‌చెరువు కాల్వపై కన్నేసిన అక్రమార్కులు మట్టితో నింపి కబ్జా చేశారు. అర కిలోమీటర్ మేర నాలాను ఆక్రమించి రెండున్నర ఎకరాల భూమిని కొల్లగొట్టారు. ప్రస్తుత మార్కెట్లో దీని విలువ రూ.కోట్లలో ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదిబట్ల మున్సిపల్ పరిధి కొంగరకలాన్‌లోని దాతర్ చెరువు నిండితే.. అలుగు పారి పులందరి వాగులోకి చేరుతుంది. దాతర్ చెరువును ఆనుకుని ఇటీవల ఓ రియల్ ఎస్టేట్ సంస్థ వెంచర్ వేసింది. ప్రస్తుతం దీని పక్కనే ఉన్న భూములను కొనుగోలు చేస్తోంది. దాతర్ చెరువు నాలా రెండు కిలోమీటర్ల మేర ఉంటుంది. భారీ ప్రవాహం ఉండే చారిత్రక ఆనవాళ్లు కలిగిన నాలాను కొంతమంది రాత్రికి రాత్రే చెరబట్టారు. వేలాది ట్రిప్పుల మట్టి నింపి దాదాపు 500 మీటర్ల పొడవునా కాల్వను కనుమరుగు చేశారు. చెరువు కట్టను సైతం చీల్చి దాదాపు రెండున్నర ఎకరాల భూమిని కబ్జా చేశారు. మార్కెట్లో దీని విలువ రూ.10 కోట్లు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. వందల ఏళ్ల నాటి కాల్వను పూడ్చేసిన అక్రమార్కులు ప్రత్యామ్నాయంగా కొత్త కాల్వ తవ్విస్తున్నారు. దీనికి ఇరిగేషన్, రెవెన్యూ శాఖల నుంచి ఎలాంటి అనుమతి లేదు.

ఫిర్యాదుతో విచారణ

కబ్జా విషయమై కొంగరకలాన్‌కు చెందిన నీళ్ల హరిబాబు అనే వ్యక్తి ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఏఈ హరిత క్షేత్ర సందర్శనకు వచ్చారు. గ్రామ నక్షా, కాలువ విస్తీర్ణం తదితర అంశాలను పరిశీలించారు. విచారణ అనంతరం నివేదిక రూపొందించి, ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

కబ్జా నిజమని తేలితే..



నాలా ఆక్రమణ విషయమై మాకు ఫిర్యాదు అందింది. అధికారులు, సిబ్బందిని ఫీల్డ్ విజిట్‌కు పంపించాం. పూర్తి స్థాయి విచారణ, సర్వేకు ఆదేశించాం. కాల్వను పూడ్చారని, కబ్జా వాస్తవమేనని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– చెన్నకేశవరెడ్డి, ఇరిగేషన్ డీఈఈ

ముందస్తు అరెస్టులు బాధాకరం


మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కుల్కచర్ల: ముందస్తు అరెస్టులు బాధాకరమని మాజీ సర్పంచులు పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులను ఇవ్వాలని ప్రశ్నిస్తే అరెస్టులు చేయించడం సబబు కాదని కుల్కచర్ల మండల, ఆయా గ్రామాల సర్పంచులు లక్ష్మణ్, తుల్జ్యా తదితరులు పేర్కొన్నారు. మాజీ సర్పంచుల బిల్లులు చెల్లించాలని లేనియెడల ఉప ముఖ్యమంత్రి అధికారిక కార్యక్రమాలను అడ్డుకుంటామని రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక పోలీస్ అధికారులు మంగళవారం వారిని ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గత ప్రభుత్వ పాలనలో సర్పంచులుగా తాము ఎంతో కృషి చేశామన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో తమను ప్రత్యేకంగా గుర్తించకపోగా తమను అరెస్టులు చేయడం ఏంటని వారు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. అరెస్టయిన వారిలో రవి, లోక్య పాల్గొన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

దోమ: గత ప్రభుత్వంలో అప్పులు చేసి గ్రామాలను అభివృద్ధి చేసిన మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం అప్రజాస్వామికమని సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. మంగళవారం దోమ మండలం నుంచి ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్తున్న వారిని పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా గ్రామ పంచాయతీలకు రూ.153 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించామని గొప్పలు చెప్పుకుంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12,600 పైచిలుకు గ్రామ పంచాయతీలకు దాదాపు రూ.వెయ్యి కోట్ల నుంచి రూ. పన్నెండు వందల కోట్ల బకాయిలు ఉన్నాయని ప్రభుత్వ పెద్దలే వెల్లడిస్తున్నారు. అయినప్పటికీ ఇటీవల విడుదల చేసిన నిధులు ఏ గ్రామ పంచాయతీకి విడుదలయ్యాయో ప్రభుత్వ పెద్దలే చెప్పాలన్నారు. దాదాపు పది వేల పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించామని ప్రభుత్వం నుంచి ప్రకటన వెలువడినప్పటికి నేటికి కూడా పరిగి నియోజకవర్గానికి ఒక్క రూపాయి విడుదల కాలేదని విమర్శించారు. ఇప్పటికైనా మాజీ సర్పంచుల బిల్లులను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గడువులోగా యూనిఫాం అందించాలి


కట్టింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కేశంపేట: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గడువులోగా యూనిఫాం అందించాలని డీఆర్‌డీఏ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యారావు అన్నారు. మండల కేంద్రంలోని మండల మహిళ సమాఖ్య భవనంలో మంగళవారం రివ్యూ సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు షర్టుల కోసం వచ్చిన క్లాత్‌ను కట్టింగ్ చేస్తున్న విధానాన్ని, మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో కుడుతున్న టైలరింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల ప్రారంభంలోగా అందుబాటులో ఉంచే విధంగా కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా టైలరింగ్ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈపీఎం బాలరాజ్, ఏపీఎం భగవంతు, సీసీలు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై యువకుడి బలవన్మరణం


సందీప్ (ఫైల్)

నవాబుపేట: ప్రేమ విఫలమైందని మనస్తాపానికి గురైన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్టిగిద్ద గ్రామానికి చెందిన బక్కని ఏసు కొడుకు సందీప్(23), వికారాబాద్‌లో ఐటీఐ చదువుతున్నాడు. ఏడాది క్రితం పట్టణానికి చెందిన ఓ యువతితో ఏర్పడిన పరిచయం, ప్రేమగా మారింది. అమ్మాయి తరపు కుటుంబ సభ్యులు వీరి పెళ్లికి అంగీకరించలేదు. దీంతో మనస్తాపానికి గురైన సందీప్ గత సోమవారం సాయంత్రం తమ పొలంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ అరుణ్ కుమార్ తెలిపారు.

ఉపాధి కూలీ మృతి


హన్మంతు (ఫైల్)

యాలాల: ఉపాధి పనులు చేస్తుండగా గుండెపోటు రావడంతో ఓ కూలీ మృతిచెందాడు. వికారాబాద్ జిల్లా తిమ్మాయుపల్లిలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన అన్నారపు హన్మంతు(38) భూమి చదును పనుల్లో పాల్గొన్నాడు. ఈసమయంలో ఛాతిలో నొప్పి వస్తోందంటూ ఒక్కసారిగా కుప్పకూలి, అక్కడికక్కడే ప్రాణం వదిలాడు. సమాచారం అందుకున్న ఉపాధి సిబ్బంది, అక్కడికి వెళ్లి వివరాలు సేకరించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామని తెలిపారు.

బ్యాటరీల దొంగ దొరికాడు

కేశంపేట: మండలంలో ఇటీవల చోరీ అయిన బ్యాటరీలను పోలీసులు రికవరీ చేశారు. మండల పరిధిలోని లేమామిడి, కేశంపేట, బైర్కాన్‌పల్లి గ్రామాల్లో ఇటీవల వాహనాల బ్యాటరీలతో పాటు జనరేటర్ బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. ఇదే విషయమై బాధితుల నుంచి పోలీసులకు నాలుగు ఫిర్యాదులు అందాయి. పోలీసులు బ్యాటరీ దొంగతనాలను ఛేదించేందుకు ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాల్లో నమోదైన ఫుటేజీలతోపాటు వివిధ కోణాల్లో సమాచారం సేకరించారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని లక్ష్మీ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న మేగిశెట్టి నాగేశ్వర్‌రావు బ్యాటరీలను దొంగిలించినట్టు గుర్తించారు. అతడి నుంచి 12 బ్యాటరీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

యూఎస్ వీసా ఇప్పిస్తానంటూ మోసం

- నిందితుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: యూఎస్ వీసా పేరుతో డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..గచ్చిబౌలికి చెందిన కాసా ప్రణయ్‌యాదవ్ అమెరికాలోని రుట్‌గర్స్ యూనివర్సిటీలో ఎంఎస్ చేసేందుకు బషీర్ అహ్మద్ అనే వ్యక్తిని సంప్రదించాడు. యూఎస్ వీసా కోసం సర్వీసు చార్జీల కింద రూ.50 వేలు ఖర్చవుతుందని చెప్పడంతో అడ్వాన్స్‌గా రూ.20 వేలు చెల్లించాడు. వీసా అప్రూవల్ కోసం ఎంబసీ ఆఫీసర్ ఒకే ఒక్క ప్రశ్న వేస్తాడని, దాంతో వీసా అప్రూవల్ అవుతుందని బషీర్ అహ్మద్ చెప్పాడు. అయితే ప్రణయ్‌యాదవ్ ఎంబసీకి వెళ్లి హాజరుకాగా ఆయనను ఏడు ప్రశ్నలు అడిగాడు. అందుకు సమాధానం చెప్పలేకపోవడంతో వీసా రిజక్ట్ అయ్యింది. తనను వీసా పేరుతో మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి పనులకు నిధులు మంజూరు


రహదారి పనులు ప్రారంభిస్తున్న అధికారులు, రైతులు

కుల్కచర్ల: బండమీదితండా గ్రామ పంచాయతీలో పొలాలకు వెళ్లేందుకు రహదారికోసం మంజూరైన రూ.12లక్షలతో ఏపీఓ చంద్రశేఖర్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ ఒక్కతాటిపై ఉండి అందరికీ ఉపయోగకరంగా ఉండే పనులను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. పొలాలకు దారులు ఏర్పాటు చేసుకోవడం వల్ల వ్యవసాయ పంటలను మార్కెట్లకు తరలించేందుకు, వ్యవసాయ పనుల నిర్వహణకు ట్రాక్టర్లను ఇతర వాహనాలను తీసుకవెళ్లేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రాజు, వినోద్‌కుమార్, మోతిలాల్, ఆంజనేయులు, దశరత్, శివాజీ, నర్సింలు, శ్రీను పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న సైదులు

మొయినాబాద్ రూరల్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం టీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు అన్నారు. ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తున్న అనేక మంది జర్నలిస్టులు పేదరికంలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వీరి అభ్యున్నతి కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ముందుకెళ్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చేగూరి రాజు, సీనియర్ పాత్రికేయులు శ్రీనివాస్ చారి, గణేశ్, సుదర్శన్, బుచ్చన్న, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు


లక్ష్మీనారాయణపూర్‌లో వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ గిరి

తాండూరు టౌన్: అక్రమంగా ఆవులను, లేగ దూడలను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తాండూరు డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 7వ తేదీన బక్రీద్ ఉన్నందునా ఆవులు, లేగ దూడలు కాకుండా ఇతర పశువుల క్రయ విక్రయాలకు సంబంధించిన రశీదులను కొనుగోలుదారులు తప్పకుండా కలిగి ఉండాలని పేర్కొన్నారు. పశువులను విక్రయించే సమయంలో వెటర్నరీ వైద్యుడు లేదా పంచాయతీ కార్యదర్శి నుంచి విక్రయదారులు అనుమతి తీసుకోవాలని సూచించారు. గోరక్షక్ సేవా సమితి లేదా ఇతరులకు ఆవులను తరలిస్తున్నట్లు తెలిస్తే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం చేరవేయాలన్నారు.

యాలాల: గోవులను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని యాలాల ఎస్‌ఐ గిరి హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు. ప్రధాన మార్గంలో వెళ్లే గూడ్స్ వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వాహనాల పత్రాలను తనిఖీ చేసి పంపిస్తున్నారు. గోవుల అక్రమ రవాణా నిరోధానికి చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఎవరైనా గోవులను రవాణా చేస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం చేరవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్‌ఐ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రూ.50 లక్షలు ఇవ్వకుంటే చంపేస్తాం

- మావోయిస్టుల పేరుతో రవీందర్‌గౌడ్‌కు లేఖ
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

జీడిమెట్ల: కుత్బుల్లాపూర్: రూ. 50 లక్షలు ఇవ్వాలని లేని పక్షంలో మాజీ ఎన్ఎస్‌యూఐ (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్) అధ్యక్షుడు కూన రాఘవేందర్‌గౌడ్‌ను చంపేస్తామని బెదిరిస్తూ మావోయిస్టుల పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు అతని తండ్రి కూన రవీందర్‌గౌడ్‌కు లేఖ రాసి కారుపై పెట్టి వెళ్లిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. షాపూర్‌నగర్‌కు చెందిన వ్యాపారవేత్త కూన రవీందర్‌గౌడ్ కుమారుడు రాఘవేంద్రగౌడ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈనెల 21న రాత్రి మంకీ క్యాప్, టీషర్ట్ ధరించిన వ్యక్తి అతడి ఇంటి మొదటి అంతస్తుకు వెళ్లాడు. ఆ తర్వాత కిందికి దిగి కారుపై ఎర్రటి వస్త్రంలో ఓ కవర్ పెట్టి అనంతరం ఇంటి ముందు ఉన్న తులసి మొక్కను తొలగించి వెళ్లిపోయాడు. 22న ఉదయం రవీందర్‌గౌడ్ తులసి మొక్క తొలగించి ఉండటాన్ని గుర్తించి పనివాళ్లతో మొక్కను అదే తొట్టిలో నాటించాడు. కొద్దిసేపటి తర్వాత కారుపై ఉన్న కవర్‌ను తెరిచి చూడగా నక్సలైట్ శంకరన్న గ్యాంగ్ పేరుతో రాసిన లేఖను గుర్తించాడు. షాపూర్‌నగర్‌లో ఉన్న రెండు ఇళ్లను పేల్చివేస్తామని.. నీకొడుకు రాఘవేంద్రను చంపేస్తామని..శుక్రవారం లోగా రూ.50లక్షలు సిద్ధంగా ఉంచుకోవాలని అందులో పేర్కొన్నారు. ఈ విషయమై కూన రాఘవేంద్ర గౌడ్ ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏప్రిల్‌లోగా సుంకిశాల పనులు పూర్తి!

- పనులు వేగవంతం చేయాలని నిర్మాణ సంస్థకు ఆదేశాలు
- ప్రాజెక్టు పనులను పరిశీలించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: మహానగరానికి కృష్ణాజలాల తరలింపుకోసం చేపట్టిన సుంకిశాల ఇంటేక్ వెల్ పనులను ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రాజెక్టు నిర్మాణ సంస్థ సీఈఓ, డైరెక్టర్, హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్లు, టీసీఎస్, గేట్ల ఎక్స్‌పర్ట్, తదితరులతో కలిసి సుంకిశాల ప్రాజెక్టు పనులను పరిశీలించారు. తొలుత ఉన్నతాధికారులతో కలిసి పైప్‌లైను విస్తరణ పనులను తనిఖీ చేశారు. ఇప్పటి వరకు మిగిలిపోయిన పైప్ లైన్ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యతలో రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. వర్షాకాలం సమీపించినందున పైప్ లైన్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్మాణ సంస్థ సీఈఓ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, నిపుణులతో కలిసి సుంకిశాల పునర్నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రీడిజైనింగ్ సంబంధించిన వివరాలపై చర్చించారు. శిథిలాల తొలగింపు అనంతరం సివిల్ వర్క్, కంట్రోల్ రూం పనులను వేగంగా ముగిస్తే సైడ్ వాల్ పునర్నిర్మాణానికి మార్గం సులువవుతుందని అంచనా వేశారు. అనంతరం నాగార్జున సాగర్ జలాశయం వైపు ఉన్న టన్నెలింగ్ పనులను పరిశీలించారు. టన్నెలింగ్ వద్ద గేట్ల నిర్మాణం, డిజైన్లపై నిపుణుడు కన్నయ్య నాయుడుతో చర్చించారు.

15 రోజుల్లో పునర్‌నిర్మాణ డిజైన్ ఫైనల్

సుంకిశాల ఇంటేక్ వెల్ రిటైనింగ్ వాల్ శిథిలాలను తొలగింపు పూర్తిచేసి పునర్‌నిర్మాణ పనులు మొదలు పెట్టేందుకు డిజైన్‌లు, డ్రాయింగ్ లను 15 రోజుల్లో ఫైనలైజ్ చేయాలని ఎండీ ఆదేశించారు. పునర్‌నిర్మాణ పనులు చేపట్టి ప్రాజెక్టును త్వరిత గతిన పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులను సూచించారు. ఇంటేక్ వెల్ ప్రాజెక్టు పైప్‌లైన్ పనులు నాలుగు కిలోమీటర్లు మినహా పూర్తి చేశామన్నారు. ఎలక్ట్రిక్ పనులు సైతం చివరి దశకు చేరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ శ్రీధర్, సీజీఎం మహేష్ కుమార్, హైదరాబాద్ ఐఐటి ప్రొఫెసర్లు శశిధర్, సురేంద్రనాథ్, గేట్ల రూపకర్త కన్నయ్య నాయుడు, టీసీఈ ప్రతినిధి నితీష్, ఇతర అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు ఉన్నారు.


జేపీజీసుంకిశాల ఇంటేక్ వెల్ పనులను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సిద్ధమవుతున్న యూనిఫాం


కుట్టు పనులను పర్యవేక్షిస్తున్న హరినారాయణ

- మహిళా సంఘాలకు కుట్టుపని బాధ్యతల అప్పగింత
- పాఠశాలల ప్రారంభంలోనే విద్యార్థులకు అందజేసేలా ప్రణాళిక

దౌల్తాబాద్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రారంభంలోనే నూతన యూనిఫాం అందించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. యూనిఫాం కుట్టు పనులను ఈ ఏడాది నుంచి స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫాం సమస్య తీవ్రంగా ఉండేది. కాంట్రాక్టర్లకు కుట్టుపని బాధ్యతలు అప్పగించడంతో పాఠశాలలు ప్రారంభమై నెలలు గడిచినా సరిపడా యూనిఫాంలు అందించేవారుకాదు. అంతేకాకుండా కొలతల్లో హెచ్చు తగ్గులు ఉండడంతో వాటి వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యను అధిగమించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలోనే వస్త్రాలను కొనుగోలు చేసి యూనిఫాం కుట్టే పనులను మహిళా సంఘాల సభ్యులకు అప్పగిస్తున్నారు. ఫిబ్రవరిలోనే వీఓఏలు, ప్రధానోపాధ్యాయుల చొరవతో విద్యార్థుల కొలతలు సేకరించారు. వాటిని పూర్తి చేయించే పనిలో సంబంధిత అధికారులు బాధ్యతలు తీసుకున్నారు.

స్కూళ్లు తెరిచే నాటికి అందజేస్తాం

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంబంధించిన దుస్తులను కుట్టాల్సిన బాధ్యత మహిళ సంఘాలకు అప్పజెప్పాం. అయితే ఇప్పటి వరకు 80శాతం పూర్తయ్యాయి. స్కూళ్లు తెరిచే నాటికి యూనిఫాంలను సకాలంలో పూర్తిచేసి ఎంఈఓకు పంపిస్తాం.

– హరినారాయణ, ఇన్‌ఛార్జి ఏపీఎం

మొత్తం 3,250 మంది విద్యార్థులకు..

దౌల్తాబాద్ మండలంలో ఎనిమిది ఉన్నత, ఏడు ప్రాథమికోన్నత, 24 ప్రాథమిక పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలలు ఉన్నాయి. అన్ని పాఠశాలల్లో కలిపి మొత్తం 3,250 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా మండలంలో నందారం, ఈర్లపల్లి, దౌల్తాబాద్, కౌడీడ్ గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులు యూనిఫాంలు కుడుతున్నారు. ఇప్పటి వరకు 80శాతం పూర్తయినట్లు తెలిపారు. ఇంకా చిన్న చిన్న పనులు మాత్రమే మిగిలాయని వివరిస్తున్నారు. కుట్టు పనులను ఐకేపీ అధికారులు, ఎంఈఓ వెంకట్‌స్వామి ప్రత్యేకంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.